క్లుప్తంగా

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

ఆమనగల్లు: పట్టణంలోని శ్రీ సాయి ఆప్టికల్స్ ఆవరణలో ఈ నెల 24న సికింద్రాబాద్ పుష్పగిరి కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని నిర్వాహకులు కొట్ర మల్లేశ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరంలో నేత్ర సమస్య ఉన్నవారికి కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఆపరేషన్లు చేయిస్తామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని కంటి జబ్బు ఉన్నవారు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

కొనసాగుతున్న సర్వేయర్ల శిక్షణ



మ్యాపును పరిశీలిస్తున్న సర్వేయర్లు

కడ్తాల్: లైసెన్స్‌డ్ సర్వేయర్ల శిక్షణ కొనసాగుతోంది. పక్షం రోజులుగా సర్వేయర్ విభాగం సిబ్బంది, సీనియర్ లైసెన్స్‌డ్ సర్వేయర్ కృష్ణ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం మండల పరిధి అన్మాస్‌పల్లిలో విలేజ్ మ్యాపు సహాయంతో ప్రభుత్వ భూములు, కుంటలు, నాళాలు, బండి బాట, కాలిబాట, భౌగోళిక గుర్తింపులైన గుడి, మజీద్ తదితర ప్రత్యేక స్థలాలు, సర్వే నంబర్, పాత కొత్త హద్దురాళ్లను ఎలా గుర్తించాలి అనే అంశంపై శిక్షణ ఇస్తున్నారు. కార్యక్రమంలో ఆర్ఐ రాజిరెడ్డి పాల్గొన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి



డీటీకి వినతిపత్రం అందజేస్తున్న తపస్ నాయకులు

మంచాల: సీపీఎస్‌ను రద్దుచేసి ఉద్యోగ, ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పూజారి రమేష్ డిమాండ్ చేశారు. శనివారం తపస్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సీపీఎస్ రద్దు చేయాలని కోరుతూ.. డిప్యూటీ తహసీల్దార్ ఎండీ హర్షద్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని సూచించారు. పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు శివకుమార్, బాధ్యులు వెంకటేశ్, దత్తాత్రేయ, రాజవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

108 వాహనంలో ప్రసవం



పసికందును బంధువుకు అందజేస్తున్న వాహన సిబ్బంది

అబ్దుల్లాపూర్‌మెట్: ఓ నిండు గర్భిణీ 108 వాహనంలో శనివారం ప్రసవించింది. వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దఅంబర్‌పేటలో నివాసం ఉంటున్న ఒడిశాకు చెందిన గుల్సర్.. పురిటినొప్పులతో బాధపడుతోంది. ఈ మేరకు కుటుంబీకులు అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వగా.. ఆమెను హయత్‌నగర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరిస్తున్నారు. ఈ క్రమంలో సదరు మహిళ మార్గమధ్యలో పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని, వారిని హయత్‌నగర్ ధర్మాసుపత్రిలో చేర్పించామని టెక్నీషియన్ ఎస్‌కె.అమ్జద్, డ్రైవర్ రాముడు తెలిపారు.

సీసీ కెమెరాలతో నిఘా పటిష్టం

శంషాబాద్ డీసీపీ రాజేశ్

కడ్తాల్: సీసీ కెమెరాల ఏర్పాటుతో నిఘా వ్యవస్థను పటిష్టం చేయడంతో పాటు, నేరాలను అరికట్టవచ్చని శంషాబాద్ డీసీపీ రాజేశ్ అన్నారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను ఆయన శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీసీ కెమెరాల ఏర్పాటుకు మక్రిపల్లి గ్రామానికి చెందిన నారాయణగౌడ్ రూ.10 వేలు విరాళంగా అందజేశారు. అనంతరం డీసీపీ మాట్లాడారు. ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమని, భద్రతా ప్రమాణాలు మరింత మెరుగుపడతాయని తెలిపారు. నిందితులను గుర్తించి, శిక్ష పడేలా చేయడంతో పాటు.. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టేందుకు దోహదపడతాయని చెప్పారు. దాతను సన్మానించారు. సీఐ గంగాధర్, ఎస్ఐ వరప్రసాద్ పాల్గొన్నారు.

నేడు బీజేపీ నాయకుల సమీక్ష

ఆమనగల్లు: పట్టణంలోని ఎస్ఎస్ఎస్ గార్డెన్‌లో ఆదివారం బీజేపీ కల్వకుర్తి నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించనున్నామని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కేకే.శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమీక్షకు ముఖ్య అతిథిగా బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి హాజరు కానున్నారని పేర్కొన్నారు. పార్టీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

అంతంత మాత్రమే..



ముళ్లపొదలతో నక్కర్తమేడిపల్లి సాలీ చెరువు

- మురిపించి.. ఆందోళన మిగిల్చి
- చిరుజల్లులతో నిరాశ పరచిన వరుణుడు
- చెరువులు, కుంటల్లో కానరాని జలకళ
- పెరగని భూగర్భ జలాలు
- ఆందోళనలో అన్నదాతలు

యాచారం: అక్కడ ఇక్కడ అని కాకుండా రాష్ట్రమంతటా విస్తృతంగా వర్షాలు కురిశాయి. కురుస్తూనే ఉన్నాయి. జిల్లాలోని పలు ప్రాంతాల్లో చెరువులు, కుంటలకు జలకళ సంతరించుకుంది. కానీ అటవీ ప్రాంతం సమృద్ధిగా ఉన్న యాచారం మండలం పరిస్థితి భిన్నంగా ఉంది. సరైన వానలు లేవు. తొలకరి జల్లులతో వరుణుడు మురిపించినప్పటికీ.. ఆశించిన మేర కరుణించకపోవడంతో చివరికి అన్నదాతలకు ఆందోళనే మిగిలింది. ఆశాజనంగా అనిపించిన కొద్దిపాటి జల్లులు మెట్టపంటలకు జీవం పోశాయి. కానీ భూగర్భజలాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి.

నాలుగు వేల ఎకరాల ఆయకట్టు

మండల పరిధి 24 గ్రామాల్లో 116 చెరువులు, కుంటలు ఉన్నాయి. అందులో వంద ఎకరాల ఆయకట్టు కలిగిన చింతపట్ల లక్ష్మణ్‌చెరువు, తాడిపర్తి బంధం చెరువు, మల్కీజ్‌గూడ మగ్దుంఅలీ చెరువు, తక్కళ్లపల్లి చెన్నరెడ్డి చెరువు, నల్లవెల్లి చెరువు, కుర్మిద్ద పెద్ద చెరువు, నక్కర్తమేడిపల్లిలోని సాలీ చెరువులు ఉన్నాయి. వీటి కింది సుమారు 4 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. చెరువులు, కుంటల్లో నీరు సమృద్ధిగా ఉంటే నాలుగు వేలతో పాటు మరో 4 వేలకు పైగా ఎకరాల్లో ఉద్యాన పంటల సాగుకు ఢోకా ఉండదు.

గొలుసుకట్టుపైనే ఆశ

మండలంలోని 15 గ్రామాలకు పైగా గొలుసుకట్టు చెరువులు, కుంటలపైనే ఆధారపడి ఉన్నాయి. యాచారం, కడ్తాల్, ఆమనగల్లు, మాడ్గుల మండలాల సరిహద్దులోని అటవీ ప్రాంతం నుంచి భారీ వరద వస్తేనే తాడిపర్తి బంధువు చెరువు నిండి అలుగు పారుతుంది. దీని ద్వారా నానక్‌నగర్, నక్కర్తమేడిపల్లి, మల్కీజ్‌గూడ, తక్కళ్లపల్లి, నల్లవెల్లి, చింతపట్ల గ్రామాల్లోని గొలుసుకట్టు చెరువులు, కుంటలు నిండి.. నల్లగొండ జిల్లా పరిధి మర్రిగూడ మండలంలోకి వరద ప్రవేశిస్తుంది. గొలుసుకట్టు చెరువులు సమృద్ధిగా నిండితే మాల్, తమ్మలోనిగూడ, కొత్తపల్లి, కొత్తపల్లి తండా, యాచారం, మొండిగౌరెల్లి, నందివనపర్తి, నస్దిక్‌సింగారం, అయ్యవారిగూడెం తదితర గ్రామాల్లో భూగర్భ జలాలు పెరుగుతాయి. బోరుబావుల్లో నీరు పుష్కలంగా ఉంటుంది.

మెట్ట పంటలకు జీవం

కొద్దిపాటి వర్షాలతో భూగర్భజలాల పెంపు అంతగా లేనప్పటికీ.. మెట్ట పంటలకు జీవంగా మారింది. చెప్పుకునే విధంగా వానలు పడకపోవడంతో మండల పరిధి గ్రామాల్లో సుమారు 5,800లకు పైగా ఉన్న బోరుబావుల్లో నీటిమట్టం పెరగలేదు. గునుగల్, గడ్డమల్లయ్యగూడ, చౌదర్‌పల్లి, చింతుల్ల, కొత్తపల్లి, మొండిగౌరెల్లి, యాచారం గ్రామాల్లో సగానికి పైగా బోర్లు నీరు లేక నిరుపయోగంగా మారాయి. దీంతో వరి సాగు చేసేందుకు రైతులు వెనకాడుతున్నారు. ముసుర్లకు నాటేస్తే పెట్టుబడులు సైతం కోల్పోతామన్న ఆందోళనలో ఉన్నారు.

మూడేళ్లుగా వెలవెల



భారీ వర్షాలు కురిస్తే నల్లవెల్లి చెరువు నిండి అలుగు పారేది. గ్రామంలోని సాగు భూములు పంటపొలాలతో పచ్చగా కళకళలాడేవి. గ్రామం సస్యశ్యామలంగా ఉండేది. కానీ మూడేళ్లుగా ఆ వరద జాడ లేదు. బోరుబావుల్లో నీటిమట్టం పెరగలేదు. నాటి పరిస్థితులు కనిపించడం లేదు.

– శీలం మధుకర్‌రెడ్డి, రైతు, మంతన్‌గౌరెల్లి

'బంధం' వట్టిపోయింది



అటవీ ప్రాంతం మధ్యలో ఉన్న తాడిపర్తిబంధం చెరువు నిండి భారీగా అలుగు పారితేనే నానక్‌నగర్, నక్కర్తమేడిపల్లి, మల్కీజ్‌గూడ, తక్కళ్లపల్లి, చింతపట్ల, నల్లవెల్లి, మంతన్‌గౌరెల్లి గ్రామాల్లోని చెరువులు, కుంటలు నిండుతాయి. నెల రోజుల పాటు వరద పారుతుంది. కానీ సమృద్ధి వానలు లేక బంధం చెరువు వట్టిపోయింది.

– ముత్యాల రాంచంద్రారెడ్డి, రైతు, నానక్‌నగర్

లక్ష్మణ్ చెరువులోనే..



చింతపట్ల లక్ష్మణ్ చెరువులోకి కొద్ది పాటి నీరు వచ్చి చేరింది. అవి కూడా మూడేళ్ల క్రితం కురిసిన భారీ వర్షాలకు వచ్చిన వరదే. ప్రస్తుతం ఆశించిన మేర వానలు పడలేదు. చెరువులు, కుంటలు నిండలేదు. ఒకవేళ భారీ వర్షాలు కురిస్తే.. చెరువు, కుంట కట్టలు, తూంలు లీకేజీ కాకుండా జాగ్రత్తలు తీసుకున్నాం.

– మంజుల, ఇరిగేషన్ శాఖ డీఈఈ, యాచారం

రాయితీపై రైతులకు సాగు యంత్రాలు

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



ఎమ్మెల్యేకు పనిముట్ల గురించి వివరిస్తున్న అధికారులు

ఆమనగల్లు: ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పరికరాలను అందజేస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. శనివారం నగరంలోని ఆయన నివాసంలో ఆమనగల్లు సహాయ వ్యవసాయ సంచాలకులు శోభారాణి, ఏఓ శ్రీనివాస్‌గౌడ్, మాడ్గుల ఏఓ అరుణకుమారి, తలకొండపల్లి ఏఓ రేణుకలు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమనగల్లు సబ్ డివిజన్‌కు మంజూరైన సాగు పరికరాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతుల కోసం మొక్కజొన్న యంత్రం, గడ్డి బేలర్, పవర్ వీడర్, బ్రష్ కట్టర్, పవర్ పిల్లర్, రోటవేటర్, ట్రాక్టర్ డ్రాన్ ఇంప్లిమెంట్స్ అందుబాటులో ఉంచిందని తెలిపారు. 40 నుంచి 50 శాతం రాయితీపై వాటిని పంపిణీ చేస్తుందని చెప్పారు. రైతులు సబ్సిడీని వినియోగించుకొని, ఆర్థికంగా ఎదగాలని సూచించారు.

పరామర్శ

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యక్తిగత సహాయకుడు జైపాల్‌రెడ్డి తండ్రి మృతి చెందాడు. ఈ మేరకు ఉప్పునుంతల మండలం తిరుమలాపూర్ గ్రామంలో మృతుడి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు. అంతకు ముందు మృత దేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. పీసీబీ సభ్యుడు బాలాజీసింగ్, మాజీ సర్పంచ్ కేశవులు, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు రమణారెడ్డి తదితరులు ఉన్నారు.

కళాశాల భవనం పూర్తి చేయండి



దీక్షలో మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ నాయకులు

ఆమనగల్లు: ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణ పనులు వెంటనే పూర్తి చేయాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్ డిమాండ్ చేశారు. భవన నిర్మాణం పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ.. చేపట్టిన రిలే నిరాహార దీక్ష శనివారం నాటికి రెండో రోజుకు చేరింది. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడారు. పట్టణంలో కళాశాల ఏర్పాటు చేసి 24 ఏళ్లు గడిచినా.. భవనం ఏర్పాటు చేయడంలో ప్రజాప్రతినిధులు విఫలమయ్యారని ఆరోపించారు. అసంపూర్తిగా ఉన్న నిర్మాణ పనులను పూర్తిచేసి, భవనాన్ని వినియోగంలోకి తేవాలని కోరారు. లేని పక్షంలో ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. దీక్షలో నాయకులు మల్లేశ్, శంకర్, వెంకటయ్య, గణేశ్, కురుమయ్య, రాజు, ప్రణయ్, శివశంకర్, శివ, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

- మార్కెట్ చైర్మన్ యాట గీత
- ఘనంగా ఆలయ వార్షికోత్సవం



చండీ విశ్వశాంతి హోమం నిర్వహిస్తున్న కాళీ ప్రత్యంగిరా మహాదేవి

ఆమనగల్లు: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని మార్కెట్ చైర్మన్ యాట గీత, కట్ట మైసమ్మ దేవాలయ చైర్మన్ మక్తాల వెంకటయ్యలు అన్నారు. ప్రతి ఒక్కరూ భక్తిభావం పెంపొందించుకోవాలని సూచించారు. పట్టణంలోని సురసముద్రం చెరువు కట్టపై వెలసిన శ్రీ కట్టమైసమ్మ ఆలయ వార్షికోత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూజారుల ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం, సుప్రభాత సేవ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీకాళి ప్రత్యంగిర మహాదేవి ఆధ్వర్యంలో ఎండు మిరపకాయలతో విశేష చండీ విశ్వశాంతి హోమం జరిపించారు. చైర్‌పర్సన్‌తో పాటు.. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, సీఐ గంగాధర్, ఎస్ఐ వెంకటేశ్, లయన్స్‌క్లబ్ ఉపాధ్యక్షుడు పాపిశెట్టి రాము పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు చిన్న వెంకటయ్య, ఎర్రవోలు యాదయ్య, వెంకటయ్య, రాజు, మహేశ్, అంజయ్య, సాయి, కిరణ్, శివ, వెంకటయ్య, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

శబ్ద కాలుష్యం.. ప్రమాదకరం

- డీజేలు పెడితే కఠిన చర్యలు
- మండపాలకు అనుమతి తప్పనిసరి
- సీఐలు నందీశ్వర్‌రెడ్డి, వేణుగోపాల్ రావు



యాచారం: డీజే నిర్వహకులతో మాట్లాడుతున్న సీఐ నందీశ్వర్‌రెడ్డి

యాచారం: శబ్ద కాలుష్యంతో ప్రమాదమని, ఇందులో భాగంగా చవితి నవరాత్రి ఉత్సవాల్లో డీజేలకు అనుమతి లేదని సీఐ నందీశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం పీఎస్‌లో నిర్వహించిన సమావేశంలో యాచారం, మాల్ కేంద్రాల డీజేల నిర్వాహకులతో ఆయన మాట్లాడారు. ఎవరికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు నిర్వహించుకోవాలని సూచించారు. డీజేలకు అనుమతి లేదన్నారు. డీజే సౌండ్స్‌తో వృద్ధులు, చిన్నారులు ఇబ్బంది పడతారని, ఒక్కోసారి ప్రాణాపాయం ఉంటుందని చెప్పారు. నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్ఐ మధు తదితరులు పాల్గొన్నారు.

మాడ్గులలో..

మాడ్గుల: వినాయక చవితి మండపాలకు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని సీఐ వేణుగోపాల్ రావు అన్నారు. శనివారం పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన సమావేశంలో డీజే ఆపరేటర్లు, ఉత్సవ కమిటీ సభ్యులతో ఆయన మాట్లాడారు. గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని కోరారు. డీజేలకు అనుమతి లేదని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, రాత్రి వేళలో ఒకరు అక్కడ ఉండాలని స్పష్టం చేశారు.

వాటర్‌ట్యాంక్ వితరణ

ఆమనగల్లు: తలకొండపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు స్థానికుడు కనుక వెంకటయ్య వాటర్‌ట్యాంక్, ఫ్యాన్‌ను బహూకరించారు. శనివారం జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాధవరావ్, లైబ్రేరియన్ షణ్ముకరెడ్డిలకు దాత అందజేశారు.

'ధరణి' పొరపాట్లను సరిచేస్తాం

కడ్తాల్: ధరణి పోర్టల్ వలన జరిగిన పొరపాట్లను సరిచేస్తామని తహసీల్దార్ ముంతాజ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో పట్టా భూములు అమ్మేసిన తరువాత.. ధరణి తప్పిదం వలన పాత పట్టాదారులే తిరిగి పాసుపుస్తకాలు పొంది ఉంటే, అలాంటి సర్వే నంబర్లలోని భూముల వివరాలను తమ దృష్టికి తేవాలని సూచించారు. భూమి లేకున్నా.. పట్టా పుస్తకాలతో రైతుభరోసా పొందుతున్న ఎవరైనా ఉంటే.. వారి వివరాలను అందజేయాలన్నారు. భూ భారతి చట్టం ద్వారా సమస్యలను పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

'దేవర' చెరువు కట్టకు మరమ్మతు



చెరువు కట్టకు మరమ్మతు చేయిస్తున్న దాత

కడ్తాల్: ఇటీవల కురిసిన వర్షాలకు దేవర చెరువు కొంత మేర కోతకు గురైంది. దీనిని గుర్తించిన ఇరిగేషన్ అధికారులు తొలుత తాత్కాలిక మరమ్మతు చేయించారు. కానీ కట్టపై గోతులు ఏర్పడంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. స్థానిక నాయకుల విజ్ఞప్తి మేరకు శనివారం బటర్ ఫ్లై సిటీ వెంచర్ నిర్వాహకులు.. కోతకు గురైన ప్రదేశంతో పాటు, కట్టపై ఏర్పడిన గోతుల్లో మట్టి పోయించి చదును చేయించారు. భవిష్యత్తులో చెరువు నిండినా.. కట్ట మీదుగా వెళ్లే వారికి ఇబ్బంది కలగకుండా ప్రత్యామ్నాయ మార్గం ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా సింగిల్‌విండో డైరెక్టర్ చేగూరి వెంకటేశ్, కాంగ్రెస్ నాయకులు జహంగీర్‌అలీ.. వెంచర్ నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. నాయకులు రాములు, లక్ష్మణ్‌రావు, సర్వేయర్ అలీ, సిద్దిగారి జంగయ్య, రాజునాయక్, చింటూ నాయక్ తదితరులు ఉన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారంలో విఫలం

- రూ.10 లక్షల బీమా కల్పించాలి
- సీఐటీయూ జిల్లా కార్యదర్శి చంద్రమోహన్



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రమోహన్

ఇబ్రహీంపట్నం: భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం అయ్యాయని సీఐటీయూ జిల్లా కార్యదర్శి చంద్రమోహన్ ఆరోపించారు. ఇబ్రహీంపట్నంలోని శ్రీ మల్లికార్జున భవన నిర్మాణ కార్మిక సంఘ సమావేశం, సీఐటీయూ 2వ మహాసభను శనివారం స్థానిక పాషనరహరి స్మారక కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రమాదవశాత్తు మృత్యువాత పడిన కార్మికులకు రూ.పది లక్షలు, అంగ వైకల్యం చెందింతే రూ.5 లక్షలు, సహజ మరణానికి రూ.2 లక్షల బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. పెళ్లి కానుకగా రూ.లక్ష, 60 ఏళ్లు దాటిన వారికి నెలకు రూ.10 వేల పింఛన్ ఇవ్వాలని కోరారు. మండలంలో కార్మిక శాఖ భవనం నిర్మించాలన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

సీఐటీయూ భవన నిర్మాణ కార్మికుల నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా యాదయ్య, అధ్యక్షుడిగా ఎల్లేశ్, ప్రధాన కార్యదర్శిగా రాజు, కోశాధికారిగా జంగయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్స్‌గా సంతోష్‌కుమార్, శ్రీను, సంయుక్త కార్యదర్శులుగా అంకమ్మరావు, సురేష్, ఆర్గనైజర్‌గా జంగయ్యలను నియమించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి స్వప్న, ఎల్లేశ్, గిరి వీరశం, వెంకటేశ్, శివ, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనం.. కట్టుదిట్టం



మాసబ్ చెరువు

- చవితి ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు
- సీసీ కెమెరాలతో పోలీసుల నిఘా
- భక్తులకు ఇబ్బంది కలగకుండా చర్యలు
- మాసబ్ చెరువు వద్ద రెండు క్రేన్ల ఏర్పాటు

తుర్కయంజాల్: చవితి నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో గణపతుల నిమజ్జనానికి అధికార యంత్రాంగం ఏర్పాట్లు ముమ్మరం చేసింది. మరో రెండు రోజుల్లో ఉత్సవాల ప్రారంభం నేపథ్యంలో ఇప్పటికే ఉత్సవ నిర్వాహకులతో అధికారులు సమీక్షలు నిర్వహించారు. తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. వేడుకలు ప్రారంభం అనంతరం మరుసటి రోజు నుంచే గణపతి గంగమ్మ ఒడికి చేరనుండగా.. మాసబ్ చెరువు వద్ద అందుకు తగిన ఏర్పాట్లలో వేగం పెంచారు. ఈ ఏడు నిమజ్జనానికి సుమారు 2 వేల విగ్రహాలు తరలి వచ్చే అవకాశం ఉంది.

డివిజన్ల నుంచి..

హుస్సేన్‌సాగర్‌తో పాటు, సరూర్‌నగర్ చెరువులో నిమజ్జనం చేయాలంటే గంటల తరబడి వేచి ఉండాల్సి పరిస్థితి. దీనిని అధిగమించేందుకు మండపాల నిర్వాహకులు మాసబ్ చెరువును అనువైన ప్రదేశంగా ఎంచుకుంటున్నారు. దీంతో మున్సిపాలిటీ పరిధి తుర్కయంజాల్, రాగన్నగూడ, కమ్మగూడ, ఇంజాపూర్, బ్రాహ్మణపల్లి, కొహెడ, మునగనూర్, తొర్రూర్‌తో పాటు, పెద్దఅంబర్‌పేట, ఆదిబట్ల, జీహెచ్ఎంసీ పరిధి బీఎన్ రెడ్డినగర్, హయత్‌నగర్, వనస్థలిపురం, హస్తినాపురం, కర్మన్‌ఘాట్, మన్సూరాబాద్ డివిజన్లలో నెలకొల్పిన విగ్రహాలను ఇక్కడే నిమజ్జనం చేయనున్నారు.

సజావుగా..

కొన్నేళ్లుగా ఇక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అధికార యంత్రాగం నిమజ్జన ప్రక్రియను పూర్తిచేస్తోంది. ఈ ఏడు కూడా అదే లక్ష్యంతో మున్సిపల్, పోలీస్, రెవెన్యూ, ఇరిగేషన్, విద్యుత్ శాఖ, వైద్య, ఆరోగ్య శాఖ, ఆర్అండ్‌బీ శాఖల అధికారులు ముందుకు సాగుతున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే సమన్వయంతో సమీక్షలు నిర్వహించారు. వీధి దీపాలు, బారికేడ్ల ఏర్పాటు పనులను విస్తృతం చేశారు.

సిబ్బందిపై ఒత్తిడి లేకుండా..

గణనాథుల నిమజ్జనానికి మాసబ్ చెరువు వద్ద రెండు క్రేన్లు ఏర్పాటు చేస్తున్నాం. వ్యర్థాలను తొలగించేందుకు హిటాచీ, జేసీబీలను సమకూర్చుకున్నాం. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన సౌకర్యాలు కల్పించనున్నాం. ఉద్యోగులపై పని ఒత్తిడి పెంచకుండా షిఫ్టుల వారీగా నియమించనున్నాం.

–భిక్షపతి, డీఈ, తుర్కయంజాల్

నిరంతరం నిఘా

నిమజ్జన ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు సిబ్బందిని అప్రమత్తం చేశాం. భారీగా బందోబస్తు ఏర్పాటు చేయనున్నాం. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చెరువు వద్ద సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశాం. నిరంతరం పర్యవేక్షిస్తాం. భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టనున్నాం.

– రవి కుమార్, సీఐ, ఆదిబట్ల

మట్టి విగ్రహాలను పూజిద్దాం

ఆదిబట్ల కమిషనర్ బాలకృష్ణ

ఇబ్రహీంపట్నం రూరల్: మట్టి విగ్రహాలను పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుకుందామని ఆదిబట్ల మున్సిపాలిటీ కమిషనర్ ఎస్.బాలకృష్ణ అన్నారు. చవితిని పురస్కరించుకొని పురపాలక సంఘం ఆధ్వర్యంలో శనివారం పట్టణ ప్రజలకు మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. చవితిని ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వినియోగం వలన వాతావరణం కలుషితం అవుతుందన్నారు. రంగులు ప్రజల జీవితాలపై పెనుప్రభావం చూపుతాయని, అందుకే మట్టితో చేసిన విగ్రహాలు మేలని చెప్పారు. భారీ మండపాలు ఏర్పాటు చేసి ఇబ్బంది పడొద్దని, విద్యుత్ తీగల నుంచి జాగ్రత్తగా ఉండాలని సూచించారు. నిమజ్జన సమయంలో అధికారుల సూచనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో డీఈ స్వర్ణకుమార్, మేనేజర్ రమేష్, టీపీఓ అబీబ్ ఉన్నిసా బేగం, సీనియర్ అసిస్టెంట్ స్వప్న తదితరులు పాల్గొన్నారు.



విగ్రహాలను అందజేస్తున్న కమిషనర్ బాలకృష్ణ

సురవరం మృతి పార్టీకి తీరని లోటు



మంచాల: సుధాకర్‌రెడ్డి చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు



ఇబ్రహీంపట్నంలో..

తుర్కయంజాల్: సీపీఐ జాతీయ నాయకుడు సురవరం సుధాకర్ రెడ్డి మృతి పార్టీకి తీరని లోటని రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి అన్నారు. ఆయన మృతికి సంతాపంగా శనివారం కొహెడ సురవరం కాలనీలో సురవరం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బడుగుల అభివృద్ధికి కృషి

మంచాల: బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి సుధాకర్‌రెడ్డి అనేక పోరాటాలు చేశారని, ఆయన మృతి పార్టీకి, ప్రజలకు తీరని లోటని సీపీఐ నాయకులు అన్నారు. సురవరం మృతికి సంతాపంగా పార్టీ శ్రేణులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం: సీపీఐ పార్టీ జాతీయ నాయకుడు, మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి మృతి పార్టీ, దేశానికి తీరని లోటని ఆ పార్టీ నాయకులు అన్నారు. ఆయన మృతికి సంతాపంగా శనివారం అంబేడ్కర్ కూడలిలో సురవరం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నర్సింహ్మ, సురేష్, బాలయ్య, నీలమ్మ, శ్రీశైలం ఉన్నారు.